సాక్షి వికారాబాద్

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



రెండో విడత పంపిణీ జరిగేనా?

గొల్లకురుమలు రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఐదేళ్లుగా నిరీక్షిస్తున్నారు. మొదటి విడత లోనూ అరకొరగానే పంపిణీ చేశారు. 8లో▸



పన్నుల వసూలులో బిజీ..

ఆస్తి పన్నుల వసూలులో మున్సిపల్ అధికారులు, సిబ్బంది బిజీబిజీగా ఉన్నారు. వంద శాతం వసూలుకు చర్యలు చేపడుతున్నారు. 8లో▸



మా 'తెలుగు' తల్లికి..

మాతృభాష కన్నతల్లి లాంటిదని, విద్యార్థులు ఎన్ని నేర్చుకున్నా తెలుగుకు తగిన గౌరవం ఇవ్వాలని ఉపాధ్యాయులు అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

చిరుధాన్యాల సాగుపై మక్కువ చూపండి



కుస్మసముద్రంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి గోపాల్

కుల్కచర్ల: చిరుధాన్యాల సాగుపై రైతులు మక్కువ చూపాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుస్మసముద్రం గ్రామ పరిధిలో సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సంప్రదాయక పంటలే కాకుండా చిరుధాన్యాల పంటలను సైతం సాగుచేయాలని సూచించారు. రాగులు, కందులు, ఉలువలు, పెసర్లు, పెబ్బర్లు, అనుములు తదితర చిరుధాన్యాలను సాగుచేయాలని అన్నారు. సాగు చేసిన పంటల వివరాలను తమ పరిధిలో ఉన్న వ్యవసాయ అధికారులకు తెలియపర్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. తద్వార ప్రభుత్వం ధాన్యాల కొనుగోళ్ల ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ, నాయకులు హన్మయ్య, లక్ష్మయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాది కీలక పాత్ర

మాజీమంత్రి ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

అనంతగిరి: పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా పాత్ర ఎంతో కీలకమని మాజీమంత్రి ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ నియోజకవర్గంలోని సోషల్‌మీడియా కోఆర్డినేటర్ల సమావేశం మాజీమంత్రి నివాసంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పటిష్టతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పార్టీలో కష్టపడ్డ నాయకునికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జాగృతం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేయబోయే కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి, కోఆర్డినేటర్లు శ్రీనివాస్, అశ్రాఫ్ అలీ, సిద్దయ్య, అజీమ్, నర్సింగ్, నరేందర్, మహేందర్, గౌస్ నందు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత



కుట్టుమిషన్ అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఈమేరకు జిల్లా భరోసా కేంద్రం తరుపున పోక్సో బాధితురాలికి స్వయం ఉపాధి కోసం బాధితుల సహాయ నిధి నుంచి మంజూరైన కుట్టు మిషన్‌ను మంగళవారం ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా ఉండలన్నారు. బాధితులకు ఎల్లవేళలా పోలీస్ శాఖ, భరోసా కేంద్రం అండగా, రక్షణగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సుస్మిత, భరోసా సభ్యులు పాల్గొన్నారు.

అవిశ్వాసంపై మరో నెల రోజులు స్టే

హైకోర్టులో మున్సిపల్ చైర్‌పర్సన్లకు ఊరట

తాండూరు: జిల్లాలోని ఇద్దరు మున్సిపల్ చైర్‌పర్సన్లకు అవిశ్వాస గండం నుంచి మరో నెల రోజుల పాటు ఊరట లభించింది. గత నెలలో చైర్‌పర్సన్ల పదవీకాలం ముడేళ్ల గడువుపూర్తయింది. 2019 మున్సిపల్ చట్టం ప్రకారం అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉంది. గతేడాది ప్రభుత్వం మున్సిపల్ చైర్మన్‌ల అవిశ్వాస తీర్మానానికి నాలుగేళ్లకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేశారు. సవరించిన చట్టం ఇంకా గవర్నర్ ఆమోదం పొందలేదు. తాండూరు , వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 21 వరకు స్టే ఇచ్చింది. గడువు ముగియడంతో మరోసారి కోర్టును ఆశ్రయించారు.

మైసమ్మతల్లికి బోనాలు

హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



కుక్కిందలో బోనాలతో తరలివస్తున్న మహిళలు

ధారూరు మండలం కుక్కింద గ్రామంలో మంగళవారం సాయంత్రం బోనాల ఊరేగింపు శోభాయమానంగా జరిగింది. బోనాలతో వచ్చిన మహిళలు గ్రామ దేవత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తమను చల్లంగ చూడాలంటూ వేడుకున్నారు. ఈ వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు వడ్లనందు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పట్లోళ్ల బసప్ప, గ్రామస్తులు వేడుకల్లో పాల్గొన్నారు.

– ధారూరు



ఉత్సవాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

పట్టు కోసం పన్నాగమా?

సంచలనం రేపిన దాడి ఘటన

- అర్ధరాత్రివేళ బీజేపీ నేత ఇంటిపై ఎమ్మెల్యే అనుచరుల వీరంగం
- మురళీకృష్ణను పరామర్శించిన పార్టీ నాయకులు
- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు



దుండగుల దాడిలో ధ్వంసమైన ఫర్నిచర్



కారు అద్దాలను పగులగొట్టిన దుండగులు

తాండూరు: జైలు నుంచి విడుదలైన కొన్ని గంటల వ్యవధిలోనే జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ ఇంటిపై దాడికి పాల్పడిన ఘటన సంచలనం రేపింది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అనుచరులు అర్ధరాత్రి పెద్ద ఎత్తున మురళీకృష్ణ ఇంట్లోకి చొరపడ్డారు. తమ నేతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తారా అంటూ ఇంట్లో ఉన్న వారిపై దాడికి పాల్పడ్డారు. మురళీకృష్ణగౌడ్ సోదరుడు రఘునందన్‌పై సైతం దాడికి దిగారు. ఒక్కసారిగా చోటు చేసుకొన్న ఘటనతో మురళీకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు భయకంపితులయ్యారు. ఇంట్లో ఉన్న టీవీ, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం ఇంటి వెనుకాల ఉన్న కార్లను అద్దాలను పగులకొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే చేరుకొని దుండగులను బయటకు తీసుకొచ్చేందుకు శ్రమించారు. పోలీసులు దుండగులను నిలువరిస్తోండగా సీఐ రాజేందర్‌రెడ్డితో పాటు పలువురు కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడ్డారు. సీఐ రాజేందర్‌రెడ్డి కాలికి గాయమైంది. తర్వాత పోలీసు బలగాలు రావడంతో అక్కడి నుంచి దుండగులను తరిమికొట్టారు. ఈ ఘటనతో మురళీకృష్ణ కుటుంబ సభ్యులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ ఇంట్లో గడిపారు. హార్ట్ పేషెంట్ అయిన మురళీతల్లికి అస్వస్థతకు గురై ఇబ్బంది పడ్డారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, నాయకులు విజయ్‌కుమార్‌తో పాటు పట్టణ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్లు ఇంటికి చేరుకుని పరామర్శించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. అనంతరం అదే రోజు రాత్రి జిల్లా నేతలు చేరుకొని భరోసా కల్పించారు.

ఆరుగురు అరెస్ట్

మురళీకృష్ణ ఇంటిపై దాడి చేసిన ఆరుగురిని తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి అరెస్టు చేశారు. అరెస్ట్ చేసిన వారిలో బీఆర్ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు అనిల్‌బాండ్, నాయకులు జావేద్, అక్బర్, సంజీవ్, అబ్రార్, అంతారం రాజులను అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

ఇద్దరి మధ్య వైరం

నియోజకవర్గంలో రెండు దశాబ్దాలుగా పలు సంస్థల ద్వారా మురళీకృష్ణగౌడ్ యువతతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2009లో తాండూరు రాజకీయాల్లోకి రోహిత్‌రెడ్డి అరంగేట్రం చేశారు. అప్పట్లో మన పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి 280 ఓట్లను సాధించారు. తర్వాత కొన్నాళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తాండూరులో మురళీకృష్ణగౌడ్ యంగ్ లీడర్స్ సంస్థను ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాలలో శివాజీ, వివేకానంద విగ్రహాల ఏర్పాటు చేస్తూ యువతను రాజకీయంగా చైతన్యం పరుస్తున్నారు. ఈ క్రమంలోనే మురళీకృష్ణతో రోహిత్‌రెడ్డికి సఖ్యత కుదిరింది. 2016లో యంగ్ లీడర్స్ అధ్యక్షుడిగా రోహిత్‌రెడ్డికి అవకాశం కల్పించారు. యువత రాజకీయాల్లోకి రావాలనే నినాదంతో పెద్ద ఎత్తున కార్యక్రమాలను చేపట్టారు. తాండూరులో యువకుడైన రోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలనే సంకల్పంతో యువతను సిద్ధం చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. నాటి టీఆర్ఎస్ పార్టీలో ఉన్న రోహిత్‌రెడ్డి వ్యవహార శైలీని పరిగణనలోకి తీసుకొని పార్టీ నుంచి ఉద్వాసన పలికారు. తర్వాత యంగ్ లీడర్స్ కార్యక్రమాలతో ప్రజలలోకి వెళ్లిన ఇద్దరు నేతలకు ప్రజాధరణ లభించింది. అప్పట్లో ఇద్దరిపై అక్రమ కేసులు నమోదయ్యాయి. ఏడాది వ్యవధిలో రోహిత్‌రెడ్డిపై 13 కేసులకు పైగా నమోదయ్యాయి. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ లభించింది. దీంతో తాండూరులో రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అయినప్పటికీ అధికారం మాత్రం మురళీకృష్ణ గౌడ్ చేతిలో నడిచింది. తర్వాత ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, మద్దతు దారుల వల్ల ఇద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. నాలుగు నెలల క్రితం మురళీకృష్ణ బీజేపీలో చేరారు. బీజేపీని తాండూరులో బలోపేతం చేస్తూ పట్టు సాధిస్తూ ఉన్నారు. మురళీకృష్ణను రాజకీయంగా దెబ్బతీసేందుకే దాడులకు పాల్పడ్డారని పలువురు భావిస్తున్నారు.

హత్య చేసేందుకే ఎమ్మెల్యే పథకం

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఫైర్

తాండూరు: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేసిన దందాలు, నేరాలు పూర్తిగా తెలిసిన మురళీకృష్ణను హత్య చేసేందుకు గుండాలు యత్నించారని మాజీ ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం పలు జిల్లాలకు చెందిన బీజేపీ నాయకులు మురళీకృష్ణను పరామర్శించారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అనుచరులు పెద్దఎత్తున మురళీకృష్ణ ఇంట్లోకి చొరబడి కనిపించిన వారిపై దాడి చేయడాన్ని తీవ్ర స్థాయిలో ఖండించారు. కొండావిశ్వేశ్వర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్‌రెడ్డిని గెలిపించామని అన్నారు. అందుకోసం తాము అన్ని విధాల నష్టపోయామన్నారు. ద్రోహం చేయడంలో రోహిత్‌రెడ్డి ముందు ఉంటారన్నారు. నాలుగు నెలల క్రితం మురళీకృష్ణ బీజేపీలో చేరారని అన్నారు. నాటి నుంచి తాండూరులో బీజేపీ బలం పెరుగుతోందన్నారు. అయితే మురళీకృష్ణను అడ్డుకొనేందుకు అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారన్నారు. శివస్వాముల ఘటన నెపంతో మురళీకృష్ణపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. న్యాయం తమవైపు ఉన్నందు వల్ల సోమవారం జైలు నుంచి విడుదలయ్యారన్నారు. కొన్ని రోజులుగా మురళీకృష్ణగౌడ్‌పై దాడి చేసేందుకు ఎమ్మెల్యే అనుచరులు ప్రయత్నాలు చేస్తున్నారని, రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. మురళీకృష్ణ కారుడ్రైవర్ బాలు మరణాన్ని సైతం పోలీసులు రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారన్నారు. రోహిత్‌రెడ్డి హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నాడని ఆరోపించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌కు బీజేపీ నాయకులతో కలిసి వెళ్లారు. మురళీకృష్ణ ఇంటిపై దాడి చేసిన వారిపై వెంటనే అరెస్టు చేయాలని సీఐ రాజేందర్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సదానందరెడ్డి, యు.రమేష్‌కుమార్, ప్రహాదరావు, మహిళా అధ్యక్షురాలు సాహు శ్రీలత తదితరులు ఉన్నారు.



సీఐ రాజేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

- అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- సమీక్షలో అధికారులకు దిశానిర్దేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: మనబడి, డబుల్ బెడ్రూమ్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనబడి కింద మొదటి విడతలో రూ.30 లక్షల లోపు చేపట్టిన పనులను, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను మార్చి 31 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కూడా నిర్ణీత సమయంలోనే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

సివిల్ పనులు సైతం..

సివిల్ పనులను మూడున్నర నెలలోపు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్ నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ప్రభుత్వం చేపట్టిన పనులన్నీ వంద శాతం పూర్తి అయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పనులు చేపట్టేందుకు కాలం అనుకూలంగా ఉందని సకాలంలో చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఆయా దశల్లో ఉన్న సీసీ రోడ్లు, భవనాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ లాల్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీ కృష్ణన్, డీఎంహెచ్ఓ పాల్వాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఆర్టీసీ బస్సు అపహరణ

తాండూరులో గుర్తింపు



అంతారం తండాలో లభించిన కర్ణాటక ఆర్టీసీ బస్సు

తాండూరు: కర్ణాటక సరిహద్దులోని చించోళి బస్ స్టేషన్‌లో పార్కింగ్ చేసిన ఆర్టీసీ బస్సు అపహరణకు గురైంది. తాండూరు మండలం అంతారం తండాలో కనిపించింది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం చించోళి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సోమవారం రాత్రి విధులు ముగించుకొని డ్రైవర్ బస్‌డిపో ప్రాంగణంలో పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం తెల్లవారు జామున తిరిగి విధులకు వెళ్లేందుకు డ్రైవర్, కండక్టర్లు వచ్చారు. అయితే రాత్రి పార్కింగ్ చేసిన బస్సు కనిపించ లేదు. వెంటనే డిపో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టీసీ డిపో అధికారులు చించోళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చించోళి నుంచి తెలంగాణ సరిహద్దులో ఉన్న తాండూరు ప్రాంతంలోకి బస్ వెళ్లి ఉంటుందని పోలీసు అధికారులు నిర్ధారించారు. కర్ణాటక పోలీసులు తాండూరు పోలీసులకు విషయం తెలిపారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. తాండూరు మండలం అంతారం తండా వద్ద ఉన్న భూ కైలాస్ దేవాలయ సమీపంలో బస్సు పార్కింగ్ చేసి ఉన్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకొన్నారు. విషయం తెలియడంతో డిపో అధికారులు బస్సును చించోళికి తీసుకొని వెళ్లారు. ఇదిలా ఉంటే అపహరించింది ఎవరనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

నిర్లక్ష్యపు యాత్రలు

- అనుమతి లేకున్నా విహారయాత్రలు
- పాఠశాల సిబ్బంది ఇష్టారాజ్యం
- బాలికపై లైంగిక దాడి ఘటనలో సర్వత్రా విమర్శలు

యాలాల: ఓ తండాకు చెందిన గిరిజన బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటన కేసు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెడకు చుట్టుకుంది. విహార యాత్రలకు తీసుకెళ్లి, క్షేమంగా ఇంటికి పంపించే బాధ్యత విషయంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా సస్పెన్షన్, షోకాజ్ నోటీసులు అందుకునే స్థాయికి వెళ్లింది. పిక్నిక్, విహార యాత్రల పేరిట విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి మరీ తీసుకెళ్లే విషయం కూడా చర్చకు దారి తీస్తోంది. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విహార యాత్రలకు, పిక్నిక్‌లకు విద్యార్థులను తీసుకెళ్లేందుకు ప్రభుత్వ పాఠశాలలకు అనుమతులు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం గతంలోనే రద్దు చేసింది. అయినప్పటికీ కొన్ని ప్రభుత్వ పాఠశాలలు ఈ నియమాలను పాటించడం లేదు. ఉపాధ్యాయులు విద్యార్థులను విహార యాత్రలకు తీసుకెళ్లడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం వెలుగుచూసిన లైంగిక దాడి ఘటన ఉపాధ్యాయుల నిర్లక్ష్య ధోరణిని బయటపెట్టింది.

అనుమతి లేని పిక్నిక్ ట్రిప్‌లు

ఈనెల 13న అగ్గనూరు ఉన్నత పాఠశాలకు చెందిన 89 మంది విద్యార్థులు, 8 మంది ఉపాధ్యాయులు హైదరాబాద్‌కు రెండు ఆర్టీసీ అద్దె బస్సుల్లో పిక్నిక్‌కు వెళ్లారు. అయితే తిరుగు ప్రయాణంలో ఆలస్యం కావడం, ఉన్నత తరగతి చదువుతున్న విద్యార్థులను సురక్షితంగా వారి వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడంలో పాఠశాల సిబ్బంది నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. గిరిజన బాలికను కారులో డ్రాప్ చేస్తానని నమ్మబలికిన పేర్కంపల్లి వాసి రఘుపతి అనే యువకుడు ఇదే పాఠశాలలో పూర్వ విద్యార్థి అని నమ్మి పంపించినట్లు ఉపాధ్యాయుల వివరణ ఇవ్వడం పట్ల బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల హెచ్‌ఎంను నిలదీస్తున్న గిరిజనులు

హెచ్‌ఎం సస్పెన్షన్

- ముగ్గురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

యాలాల: అగ్గనూరు పాఠశాలకు చెందిన గిరిజన బాలికపై లైంగిక దాడి ఘటన కేసులో పాఠశాల హెచ్‌ఎం వెంకటస్వామి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఆదేశాలు జారీ చేశారని మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న నగరానికి పిక్నిక్‌కు తీసుకెళ్లిన పాఠశాల సిబ్బంది, విద్యార్థులను సురక్షితంగా ఇంటికి చేర్చే క్రమంలో నిర్లక్ష్యం వహించారని భావిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. హెచ్‌ఎంపై సస్పెన్షన్‌తో పాటు మరో ముగ్గురు టీచర్లను షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. బాలిక లైంగిక దాడి ఘటనలో హెచ్‌ఎంతో పాటు మరో టీచర్ కృష్ణకుమార్ నిర్లక్ష్యం సైతం ఉన్నప్పటికీ, హెచ్‌ఎంను మాత్రమే సస్పెన్షన్ చేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు కారణమైన ఇద్దరిపై బాధిత కుటుంబ సభ్యులు సైతం మంగళవారం దళిత, ప్రజాసంఘాల నాయకులతో కలిసి తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ నిర్లక్ష్య ఘటన కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న సదరు ఉపాధ్యాయుడి గ్రామానికి చెందిన మరో వ్యక్తి జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తుండటంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడకుండా తప్పించారనే ప్రచారం జరుగుతుంది. ఉపాధ్యాయుల నిర్లక్ష్య ఘటనలో ఒకరిపై సస్పెన్షన్ వేటు పడగా, మరో ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

క్లుప్తంగా

పేదలకు అండగా 'బీఎమ్మార్'

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



ఆర్థికసాయం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

దోమ: బీఎమ్మార్ ఫౌండేషన్ పేదలకు అండగా నిలుస్తోందని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మనోహర్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, తమ ఫౌండేషన్ తరుపున ప్రతీ పేద కుటుంబాన్ని ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, విద్యా కమిటీ చైర్మన్ యాదయ్య, బీఎమ్మార్ ఫౌండేషన్ సభ్యులు గోవర్దన్, శ్రీనివాస్, సభనయ్య, గౌస్, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపాన్ని గుర్తించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్య అధికారులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో అయోడిన్ లోపం పిల్లలను గుర్తించి వారికి సరైన సూచనలు, సలహాలు ఇవ్వాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ జీవరాజ్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఎన్‌సీడీ అధికారుల బృందం ఆధ్వర్యంలో జిల్లాలోని వైద్యులకు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఇతర సిబ్బందికి అయోడిన్ లోపంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన బాల, బాలికలకు గాయిటర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. అయోడిన్ లోపంతో మందబుద్ధి, మాతృ మరణాలు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రతన్, డాక్టర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత పంపిణీ జరిగేనా?

ఐదేళ్లు కావస్తున్నా నెరవేరని లక్ష్యం

- మొదటి విడతలో మండలానికి 1313 యూనిట్లు మంజూరు
- పంపిణీ చేసింది 656 యూనిట్లే
- ఆందోళనలో గొర్రెల కాపలదారులు



దౌల్తాబాద్: గొల్లకురుమలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి 75శాతం రాయితీతో గొర్రెలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని 2017లో ప్రారంభించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెల పెంపకందారుల సొసైటీలను సైతం ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా 18 సంవత్సరాలు పైబడిన యాదవ కులస్తులు ఒక సంఘంలో సభ్యత్వం పొంది ఉండాలనే నిబంధన ఉంది. ఒక్కో యూనిట్ విలువ రూ.లక్షా 25వేలు. కాగా లబ్ధిదారుడి వాటా రూ.31,250లు చెల్లిస్తే ప్రభుత్వం రూ.93,750లు సబ్సిడీ చెల్లించి గొర్రెలను పంపిణీ చేస్తుంది. ఒక్కో లబ్ధిదారుడికి ఒక యూనిట్ గొర్రెలను మంజూరు చేస్తుంది. ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉండేటట్లు పంపిణీ చేస్తారు. ఈ పథకాన్ని అప్పట్లో అట్టహాసంగా పంపిణీ చేసి అమలులో మాత్రం జాప్యం జరుగుతూనే ఉంది. లబ్ధిదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి రెండు విడతలుగా రెండు సంవత్సరాల కాలంలో గొర్రెలను పంపిణీ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. కాని ఐదేళ్లు కావస్తున్నా మొదటి విడత పంపిణీ పూర్తి కాలేదు. మరి రెండో విడత పంపిణీ ఎప్పుడు చేపడతారో తెలియని అయోమయ పరిస్థితుల్లో లబ్ధిదారులు ఉన్నారు.

మండలానికి 1313 యూనిట్లు

మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉండగా పథకానికి అర్హులైన 1313 మంది గొర్రెల పెంపకందారుల సంఘంలో సభ్యులుగా ఉన్నారు. వీరికి రెండు విడతల్లో గొర్రెల పంపిణీ చేపట్టడానికిగాను డ్రా పద్ధతిలో అందరి సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో సగం మందికి, రెండో విడతలో మిగిలిన సగం మందికి గొర్రెలు పంపిణీ చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. మంజూరైన 1313యూనిట్లలో మొదటి విడతో 656 యూనిట్లు మాత్రమే పంపిణీ చేశారు.

తప్పని నిరీక్షణ

రెండో విడత గొర్రెల పంపిణీని నాలుగేళ్లు కావస్తున్నా చేపట్టకపోవడంతో గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రాలో పేరు వచ్చిన లబ్ధిదారులకు మొదటి విడతలో పంపిణీ చేయాలని మిగిలిన సగం లబ్ధిదారులకు రెండో విడతలో మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రాలో పేర్లు రాని లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు.

> **ఆదేశాలు వస్తే అందజేస్తాం**
>
> మండలానికి గొర్రెల యూనిట్లు 1313 మంజూరు కాగా మొదటి విడతలో 656 అందజేశాం. మిగిలిన వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అందజేస్తాం. ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు వస్తే ప్రక్రియను వేగవంతం చేస్తాం.
>
> – వరలక్ష్మి, ఇన్‌ఛార్జి వైద్యాధికారి

హోంగార్డు కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎంపీ రంజిత్ రెడ్డి



ఎంపీ రంజిత్ రెడ్డిని కలిసిన హోంగార్డు కుటుంబీకులు, గ్రామస్తులు

కుల్కచర్ల: హోంగార్డు శ్రీనివాస్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి అన్నారు. చాపలగూడెం గ్రామానికి చెందిన హోంగార్డు ఘండి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. కాగా.. మంగళవారం హోంగార్డు కుటుంబ సభ్యులు ఎంపీని నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకుల యోగక్షేమాలు ఎంపీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, మృతుడి భార్యకు ఉపాధి కల్పించేందుకు కలెక్టర్‌ను సంప్రదించి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మృతుడి కూతురు హారిక అనారోగ్యంతో బాధపడుతోందని, ఆమెకు ఉచితంగా మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, మృతుడి భార్య సునీత, గ్రామస్తులు ఉన్నారు.

ఎర్ర తెగులుకు మందుల పిచికారీ తప్పనిసరి



వరి పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ శిరీష

యాలాల: వరి పంటలో ఇటీవల పెరుగుతున్న ఎర్ర తెగులు నివారణకు రైతులు ఆరుతడి పాటించి మందులు పిచికారీ చేసుకోవాలని రాస్నం క్లస్టర్ ఏఈఓ శిరీష సూచించారు. మంగళవారం రాస్నం శివారులో వరి పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..వరి పంటలో ఎర్ర తెగులు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీటి నివారణకు గాను ఎకరానికి క్లోరిపైరిపాస్ 400 ఎం.ఎల్ లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరానికి, లాంబ్డా సైహలత్రిన్ 1.5 ఎం.ఎల్ ప్రతి ఎకరానికి లేదా క్లోరంత్రనిలిప్రోల్ 60 ఎం.ఎల్ ప్రతి ఎకరానికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మందు పిచికారి చేసే ముందు పంటలకు ఆరుతడి పాటించాలన్నారు. వీటితో పాటు బ్యాక్టీరియల్ ఆకు ఎండు తెగులు లక్షణాలు ఉంటే ప్లంటోమైసిన్ 100 గ్రాములు ఎకరానికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు ఉన్నారు.

పన్నుల వసూలులో బిజీబిజీ

- లక్ష్యం రూ.3.27 కోట్లు
- వసూలైంది రూ.2.59కోట్లు
- మొండి బకాయిలు రాబట్టేందుకు అధికారుల కుస్తీ



వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం

వికారాబాద్ అర్బన్: ఆస్తి పన్నుల వసూలులో మున్సిపల్ అధికారులు, సిబ్బంది బిజీగా ఉన్నారు. వందశాతం వసూలు చేసేందుకు లక్ష్యం నిర్దేశించుకొని పని చేస్తున్నారు. అయితే మొండి బకాయిలతో లక్ష్యం నెరవేరాల లేదు. చాలా కాలంగా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస, వ్యాపార సముదాయల మొండి బకాయిలను రాబట్టేందుకు అధికారులు కుస్తీ పడుతున్నారు. వికారాబాద్ మున్సిపాలిటీలో ప్రభుత్వ కార్యాలయాలే అధికంగా పన్ను ఎగవేస్తున్నాయన్న ఆరోపణలు లేకపోలేదు. ఏళ్లుగా పన్నులు చెల్లించకుండా మున్సిపల్ సేవలు మాత్రం పొందుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రధాన శాఖలు, జిల్లా కార్యాలయాలు చాలా వరకు పన్నులు సరిగ్గా చెల్లించడం లేదు. ఉన్నతాధికారులు విధులు నిర్వహించే భవనాలు కావడంతో.. చర్యలకు పురపాలక శాఖ వెనుకాడుతోంది. దీంతో వికారాబాద్ మున్సిపల్‌కు ఆర్థికంగా గండి పడుతుందనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొన్ని 2010 నుంచి రూ. లక్షల్లో బకాయి పడ్డాయి. తాకీదులు జారీ చేస్తే కొంత మేర చెల్లిస్తున్న ఆయా శాఖలు.. పెద్ద మొత్తం చెల్లించలేక పోతున్నాయి.

లక్ష్యం రూ.327.94 లక్షలు

మున్సిపాలిటీలో 13,453 గృహాలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల నుంచి ఏడాదికి రూ.3కోట్ల 27లక్షల 94వేలు ఆస్తిపన్ను రూపంలో సమకూరాలి. ఇందులో ప్రభుత్వ ఆస్తుల నుంచి సుమారు రూ.60లక్షలు రావాల్సి ఉంది. మరో నలభై రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో పన్ను వసూలుపై అధికారులు దృష్టి సారించారు. ఇప్పటి వరకు రూ.2కోట్ల 59లక్షల 31వేలు వసూలు చేశారు. మిగిలిన 40 రోజుల్లో మిగతా రూ.68లక్షలపై చిలుకు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ గడువులోగా రూ.68లక్షలు వసూలు చేస్తే.. పట్టణంలో వంద శాతం పన్ను వసూలు అయినట్లే.

విమర్శిస్తే.. సహించేది లేదు

- తాండూరులో మురళిని తిరగనివ్వం
- వన్‌టైం కాదు.. ఆల్‌టైం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



తాండూరు రూరల్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి తదితరులు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని విమర్శిస్తే.. సహించేదిలేదని, బీజేపీ నేత గాజీపూర్ మురళీకృష్ణగౌడ్‌ను తాండూరులో తిరగనివ్వమని ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు గౌతపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గౌతపూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాందాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరేందర్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేపై మురళీకృష్ణ వాఖ్యలు చేయడం ఖండిస్తున్నామని, ఆయనపై అనుచిత వాఖ్యలు చేస్తే దాడి చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దయతోనే మురళీకృష్ణ ఆర్థికంగా ఎదిగి, ఇప్పుడు ఆయన్నే విమర్శిస్తున్నారని మండిపడ్డారు. వన్‌టైం ఎమ్మెల్యే కాదని.. ఆల్‌టైం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అని చెప్పారు. వచ్చేసారి కూడా ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శకుంతల, ఉమాశంకర్, ద్యావరి నరేందర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, గోపాల్, బసిరెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, రాజుగౌడ్, రాకేష్‌గౌడ్, హుసేన్, శ్రీను, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొడుతున్న మరళీ..

తాండూరు: నిన్న మొన్నటి వరకు ఎమ్మెల్యేకు మురళీకృష్ణ షాడోగా ఉన్నారని, ఎమ్మెల్యే వెంట ఉంటూ.. భూ కబ్జాలు, సెటిల్మెంట్‌లు, వ్యాపారాలు చేసిన వ్యక్తిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్ ఆరోపించారు. పట్టణంలోని హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాండూరు ప్రాంతంలో ప్రజల మధ్య తగాదాలు పెట్టి విద్వేషాలను రెచ్చగొట్టేలా మురళీకృష్ణ చేస్తున్నారని విమర్శించారు. విభేదాలతో దూరంగా ఉన్నప్పుడు ఎవరి పనులు వారు చేసుకోవాలి. అంతేకాని ఇలా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవుపలికారు. ఎమ్మెల్యే వెంట తాము ఉంటామని, ఆయన్ను విమర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అస్లాం, వెంకన్నగౌడ్, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాసచారి, నరేందర్‌గౌడ్, ఇర్ఫాన్, రజాక్, వెంకట్‌రెడ్డి, హరిగౌడ్, శ్రీనివాస్, సలీమ్, సంతోష్‌గౌడ్,సుధాకర్,ఇర్షాద్, ఇంతియాజ్ తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.లక్ష నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

కుల్కచర్ల: తాళం వేసిన గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పురుషోత్తం తెలిపిన ప్రకారం.. చాకల్‌పల్లి గ్రామానికి చెందిన వీర్లపల్లి చంద్రయ్య, తన భార్య రోజుమాదిరిగానే సోమవారం కూలీ పనులకు వెళ్లారు. కాగా పాఠశాలకు వెళ్లిన కూతురు వచ్చే వరకు తలుపులు తీసి ఉండడం చూసి తండ్రికి సమాచారం ఇచ్చింది. దీంతో చంద్రయ్య ఇంటికి వచ్చి పరిశీలించగా బీరువా పగలగొట్టి అందులో ఉన్న రూ.లక్ష నగదు మరియు 4తులాల వెండి, అర తులం బంగారు కమ్మలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే ఆయన నవాబుపేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రేగడిచిల్కమర్రిలో ఈతచెట్ల తొలగింపు



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలోని రేగడిచిల్కమర్రి గ్రామంలో ఈత చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం గౌడసంఘం నాయకులు ఎక్సైజ్ సీఐ రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... షాద్‌నగర్ ప్రాంతంలో కొందరు రియల్ వ్యాపారులు ఫాం ల్యాండ్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. వెంచర్లను అభివృద్ధి చేసే క్రమంలో ఈతచెట్లను నరికివేస్తున్నారని అన్నారు. ఈతచెట్లను తొలగించడంతో వృత్తినే నమ్ముకొని జీవనోపాధిని పొందుతున్న గౌడన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈత, తాటిచెట్లను తొలగించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ఈ నిబంధనను రియల్టర్లు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఈతచెట్లను నరికివేస్తున్నారని ఆరోపించారు. ఈతచెట్లను నరికినవారిపై అబ్కారీ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గౌడసంఘం నాయకులు శివరాములుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంజయ్యగౌడ్, శ్రీశైలంగౌడ్, వెంకటేష్‌గౌడ్, రాములుగౌడ్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న సునీతారెడ్డి

అనంతగిరి: వేసవి కాలం వస్తున్నందున జిల్లాలో ఎక్కడ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అధికారులకు జెడ్పీ చైర్పర్సన్ సునీతారెడ్డి సూచించారు. మంగళవారం ఆమె జెడ్పీ కార్యాలయంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి నల్లాల ద్వారా సురక్ష తాగునీటిని అందిస్తుందని అన్నారు. ఎక్కడైనా తాగునీటి సరఫరా ఆగిపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే పశువులకు తాగునీటికి నీటి తొట్టీలు నిండుగా ఉంచాలన్నారు. జెడ్పీ నిధులతో జిల్లా పరిధిలో కొనసాగుతున్న పనుల్లో వేగం పెంచాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. అన్ని ఆస్పత్రుల్లో స్నేక్ బైట్, డాగ్ బైట్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, అధికారులు శ్రీనివాస్ రెడ్డి, బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గన్నారు.

రెండుకు చేరిన మృతుల సంఖ్య

పెద్దేముల్: మండల పరిధిలోని బుద్దారం వాగు సమీపంలో సోమవారం రాత్రి బైక్, జీపు ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరుకుంది. తాండూరు నుంచి వస్తున్న బైకు, ఎదురుగా వస్తున్న జీపు ఢీకొన్న ప్రమాదంలో బైకుపై ఉన్న బుద్దారం గ్రామానికి చెందిన మంతటి శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే బైకుపై ఉన్న నాగులపల్లికి చెందిన ఈడ్గీ మహేశ్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.దీంతో వైద్య చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. దీంతో మంగళవారం నాగులపల్లి గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

ఫాంహౌస్‌పై పోలీసుల దాడులు

మహిళ, ఐదుగురు విటుల అరెస్ట్

కొత్తూరు: మహేశ్వరం మండలంలోని ఓ తండాకు చెందిన నాయకుడికి కొత్తూరు పట్టణ శివారులోని ఓ వెంచర్‌లో ఫాంహౌస్ ఉంది. దీంట్లో పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే పక్కా సమాచారంతో ఏహెచ్‌టీయూ(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్), స్థానిక పోలీసులు మంగళవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఓ మహిళ (23), మహేశ్వరం మండలంలోని సుభాన్‌పూర్, పెద్దమ్మతండా, చిన్నతూప్ర, నల్లచెర్వుతండా, మన్సాన్‌పల్లి గ్రామాలకు చెందిన ఐదుగురు విటులనుగుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మహిళను కడ్తాల్ సమీపంలోని ప్రజ్వల హోంకు, విటులను రిమాండ్‌కు తరలించారు. వీరినుంచి మూడు కార్లు, 9 సెల్‌ఫోన్లు, రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాలరాజు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాఠశాల

- బడి పక్కనే బెల్ట్ దుకాణం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



దొంగ ఎన్కేపల్లి పాఠశాల ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు

దోమ: ప్రభుత్వ పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి పాఠశాలలో మంగళవారం మందుబాబులు తాగి పడేసిన మద్యం బాటిల్లు దర్శనమిచ్చాయి. దీంతో పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం కాగానే కొంతమంది యువకులు పాఠశాలకు ఆనుకుని ఉన్న బెల్ట్ దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి పాఠశాలలోనే సేవిస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల అసాంఘిక కార్యకలపాలకు అడ్డగా మారిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని బెల్ట్ దుకాణాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవి

కందుకూరు: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల నిర్వహణకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. మంగళవారం కందుకూరు, మహేశ్వరం మండలాల పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ గురుకులాల పనివేళలను మార్చాలని, సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగి మాణిక్‌రెడ్డికే మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.బుగ్గరాములు, మహేశ్వరం మండల ప్రధానకార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి తిరుమల శ్రీనివాస్, హనుమాన్‌దాస్, కందుకూరు మండల అధ్యక్షుడు డాక్టర్ కల్లేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేబీ రాములు, కార్యదర్శులు కృష్ణయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేయడం సరికాదు

ఏఐసీసీ మెంబర్ రమేశ్ మహరాజ్



మాట్లాడుతున్న రమేశ్ మహరాజ్

తాండూరు: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు తోడు దొంగలేనని ఏఐసీసీ మెంబర్ రమేశ్ మహరాజ్ విమర్శించారు. మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఒకసారి ఎమ్మెల్యే కావడంతో తాండూరులోని ప్రశాంతమైన రాజకీయాలను చెడగొట్టారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ ఇంటిపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్షం పటిష్ఠంగా ఉన్నప్పుడే అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పని చేస్తాయన్నారు. కానీ బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత ప్రతిపక్షం లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్నటి వరకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మురళీకృష్ణగౌడ్ తాండూరు ప్రాంతంలో వ్యాపారాలు సాగించి తర్వాత మన స్పర్థలు రావడంతో విడిపోయారు. కానీ ఇతర పార్టీలోకి వెళ్లిన మురళిపై దాడి చేయడాన్ని సరికాదన్నారు. తాండూరులో డ్రగ్స్ కల్చర్‌ను తీసుకొచ్చింది రోహిత్‌రెడ్డి అని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, యాలాల మండల అధ్యక్షుడు భీమయ్య, నాయకులు జనార్దన్ రెడ్డి, ఉత్తమ్‌చంద్, బాతుల వెంకటయ్య, భీంశంకర్, బంటు వేణుగోపాల్, హబీబ్‌లాల తదితరులున్నారు.

అగ్గిపెట్టె ఇవ్వలేదని కత్తితో దాడి

- తీవ్రంగా గాయపడిన దుకాణదారుడు
- పోలీసుల అదుపులో నిందితుడు తేజ



తీవ్ర గాయాలతో గౌస్

ధారూరు: మద్యం మత్తులో దుకాణానికి వచ్చి అగ్గిపెట్టె కోసం ఓ యువకుడు పట్టుబట్టాడు. తాగిన మైకంలో ఉన్న యువకున్ని చూసిన దుకాణ యజమాని భార్య నచ్చజెప్పి పంపించే ప్రయత్నం చేసింది. బయటకు వెళ్లి వస్తున్న యజమానిపై ఆ యువకుడు రాయి, కత్తితో దాడిచేశాడు. రాయితో తల పగులగొట్టి, కత్తితో మూడుచోట్ల పొడిచి తీవ్రంగా గాయపర్చాడు. కుటుంబీకులు క్షతగాత్రున్ని వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించిన సంఘటన ధారూరు మండల పరిధిలోని హరిదాస్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హరిదాస్‌పల్లి గ్రామంలో ఎండి గౌస్(40) కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన గట్టెపల్లి తేజ(20) మద్యం సేవించి సిగరెట్ కావాలంటూ గౌస్‌ను పట్టుబట్టాడు. భర్త బయటకు వెళ్లగా.. భార్య ఫాతిమా షాపు మూసివేశామని చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయింది. ఇంట్లోకి వస్తున్న గౌస్‌ను చూసిన తేజ దూషిస్తూ.. అగ్గిపెట్టె ఇవ్వమంటే ఇవ్వడం లేదు. దుకాణం ఎందుకు పెట్టావ్ అంటూ గౌస్‌ను పక్కనే ఉన్న రాయితో దాడిచేశాడు. అడ్డుకునే యత్నం చేసిన గౌస్‌ను.. తన దగ్గర ఉన్న కత్తితో మూడు చోట్ల పొడిచాడు. అరుపుల విన్న గౌస్ భార్య ఇంట్లోంచి పరుగున వస్తూ బిగ్గరగా అరవడంతో అక్కడి నుంచి తేజ పారిపోయాడు. కుటుంబ సభ్యుల సహకారంతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం నిందితున్ని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. నిందితుడు తేజ మద్యంతో పాటు నిత్యం గంజాయి సేవిస్తాడని గ్రామస్తులు తెలిపారు. తేజకు గంజాయి ఎవరు సరఫరా చేస్తున్నారో విచారించి, గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.